సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



కూలీల సంఖ్య పెంచాలి
ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు ఎంపీడీఓలు, ఏపీఓలు చొరవ చూపాలని డ్వామా పీడీ వెంకట్రావు సూచించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,480
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,581
3 శాతం జీఎస్టీతో	రూ.5,748
సవర (8 గ్రా)	రూ.45,984

గరిష్టం/కనిష్టం
39.2 /26.0

వాతావరణం
బుధవారం గాలిలో 47 శాతం తేమ ఉంది. గురువారం మరింత ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



అందరి సహకారంతో ప్రగతి బాట

- సంక్షేమ ఫలాలను పక్కాగా అందిస్తాం
- నూతన కలెక్టర్ హరినారాయణన్


కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు


బాధ్యతలు స్వీకరిస్తున్న హరినారాయణన్

నెల్లూరు(అర్బన్): 'అందరి సహకారంతో జిల్లాను ప్రగతి బాటలో నడిపిస్తాం. ప్రజలకు సంక్షేమ ఫలాలను పక్కాగా అందిస్తాం.' అని నూతన కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. బుధవారం ఆయన నెల్లూరులోని కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. కాగా పుష్పగుచ్ఛాలు స్వీకరించలేదు. ప్రభుత్వ శాఖల అధికారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం హరినారాయణన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులకు అందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, మీడియా సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్‌తోపాటు పలు పరిశ్రమల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వాటిని వేగవంతంగా పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. అన్ని రంగాల్లో ప్రభుత్వ లక్ష్యాలను సాధించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఏఓ షఫీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాపై పూర్తి అవగాహన ఉంది

- ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణ
- నూతన ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుమలేశ్వర్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'నాకు జిల్లాపై పూర్తి అవగాహన ఉంది. ప్రజల భాగస్వామ్యంతో నేర నియంత్రణకు కృషి చేస్తా.' అని నూతన ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వహించి మెరుగైన శాంతిభద్రతలు అందిస్తానని చెప్పారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఎప్పుడైనా కలవొచ్చన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు అన్ని వర్గాలతో కలిసి నేరాల నియంత్రణకు కృషిచేస్తామన్నారు. అసాంఘిక శక్తులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోమని కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాపై నిరంతర దాడులు చేసి అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి శాఖపై విశ్వాసాన్ని పెంపొందిస్తామన్నారు. తమ ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించి సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. తొలుత ఆయన సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు పి.వీరాంజనేయరెడ్డి, అబ్దుల్ సుభాన్, సురేష్‌బాబు, గాంధీ, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 510 మెగావాట్లు, రెండో యూనిట్లో 390 మెగావాట్లు, మూడో యూనిట్లో 670 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

19న సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీలో కారుణ్య నియామకాల కింద కండక్టర్, శ్రామిక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 19వ తేదీన జరుగుతుందని జిల్లా ప్రజా రవాణాధికారి పీవీ శేషయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నెల్లూరులోని ప్రధాన బస్టాండ్‌లో ఉన్న జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో జరిగే పరిశీలన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. రానివారు ఉద్యోగ అవకాశం కోల్పోతారని, ఇంకా భవిష్యత్‌లో కారుణ్య నియామకానికి అర్హత ఉండదన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ గంగాభవాని

నెల్లూరు(టౌన్): డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈఓ గంగాభవాని ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభం కాగా అర్ధరాత్రి వరకు జరిగింది. మొత్తం 239 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థుల ఒరిజనల్ సర్టిఫికెట్ల ను అధికారులు పరిశీలించారు. మెరిట్ ఆధారంగా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పోస్టింగ్ కల్పించి ఆర్డర్‌లను అందజేశారు. వారు వెంటనే విధుల్లో చేరాలని అధికారులు తెలిపారు. కాగా క్వాలిఫై అయిన మొత్తం 440 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని డీఎస్సీ-98 అభ్యర్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో అభ్యర్థులు నిరసన తెలిపారు.

సోమశిలలో 52.779 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 52.779 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 366 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 250 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.808 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 335 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

పీఎంఏజీవైలో జిల్లాకు అవార్డు

నెల్లూరు(పొగతోట): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై) అమలులో జిల్లాకు అవార్డు లభించింది. ఇందులో భాగంగా రూ.10 లక్షల గ్రాంట్‌ను జిల్లాకు కేటాయిస్తూ రాష్ట్ర అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిషత్ హెడ్ ఆఫ్ అకౌంట్‌కు ఈ నిధులు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను నిధులను వినియోగించుకోవచ్చు. అవార్డుకు జిల్లా ఎంపిక కావడంపై జెడ్పీ సీఈఓ బి.చిరంజీవికి జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు.

సమావేశాలెందుకు పెట్టలేదు?


సమాధానం చెప్పకుండా సమావేశాన్ని వాయిదా వేసి వెళ్లిపోతున్న మేయర్ స్రవంతి


సమావేశాలు నిర్వహించకపోవడంపై మేయర్‌ను ప్రశ్నిస్తున్న కార్పొరేటర్లు

- బడ్జెట్ సమావేశంలో మేయర్‌ను నిలదీసిన కార్పొరేటర్లు
- ఎవరో చెబితే నిర్వహించలేదని ఆగ్రహం
- మేయర్ సమాధానం చెప్పలేక రెండుసార్లు సమావేశం వాయిదా
- రూ.716 కోట్ల వార్షిక బడ్జెట్ ఆమోదం

నెల్లూరు(బారకాసు): తొమ్మిది నెలల నుంచి నగర పాలక సంస్థ జనరల్ బాడీ సమావేశాలు ఎందుకు నిర్వహించలేదని కార్పొరేటర్లు మేయర్ పొట్లూరి స్రవంతిని నిలదీశారు. సమావేశాలు పెట్టకపోవడంతో సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరో చెబితే జనరల్ బాడీ నిర్వహించలేదని, ఇది మంచి పద్ధతి కాదని ఓ కార్పొరేటర్ అన్నారు. బుధవారం నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం కౌన్సిల్ సమావేశ మందిరంలో 2023 – 24 వార్షిక బడ్జెట్ సమావేశం మేయర్ అధ్యక్షతన జరిగింది. తొలుత మాజీ కార్పొరేటర్ దువ్వూరు శరత్‌చంద్ర మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని అకౌంటెంట్ విశ్వనాథంను మేయర్ ఆదేశించారు. ఈ క్రమంలో కార్పొరేటర్లు తొమ్మిది నెలలుగా జనరల్ బాడీ సమావేశాలు ఎందుకు నిర్వహించలేదో మేయర్ సమాధానం చెప్పాలని నిలదీశారు. అలాగే పలు అంశాలపై కొందరు కార్పొరేటర్లు నిరసన తెలియజేయడంతో మేయర్ రెండుసార్లు సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

అభ్యంతరం

కాగా బడ్జెట్‌లో పొందుపరిచిన పలు అంశాలపై కార్పొరేటర్లు అభ్యంతరాలు తెలిపారు. అలాగే బడ్జెట్ నివేదిక రూపకల్పన బాగోలేదని, అందులో ఆదాయం, వ్యయం ఎందుకు చూపలేకపోయారని ప్రశ్నించారు. అధికారుల తప్పిదం వలన జరిగిందని మేయర్ సమాధానమిచ్చారు. కేంద్రం ఇస్తున్న నిధులను ఎందుకు వినియోగించలేకపోయారని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ప్రశ్నించారు. ఈ ఏడాదైనా నిధులను పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమావేశాలు ఎందుకు పెట్టలేకపోయారో కారణం చెప్పాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. అయితే మేయర్ దాటవేస్తూ వచ్చారు. సుమారు రెండుగంటలపాటు మేయర్ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. చివరికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ప్రారంభించారు.

ఆమోదం

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక బడ్జెట్ రూ.716,49,03,000కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. జనరల్ బాడీ సమావేశాలను ఇకనుంచైనా సకాలంలో నిర్వహించాలని సభ్యులంతా మరోసారి కోరారు. తమ డివిజన్లలో సమస్యలను పరిష్కరించేందుకు త్వరగా సమావేశం పెట్టాలని కార్పొరేటర్లు మేయర్‌ను మరోసారి డిమాండ్ చేశారు. దీంతో మేయర్ ఈనెల 24వ తేదీన జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తామని చెప్పి బడ్జెట్ సమావేశాన్ని ముగిస్తున్నామంటూ కార్యాలయంలోని తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు.

కార్పొరేటర్లు ఏమన్నారంటే..

మొయిళ్ల గౌరి మాట్లాడుతూ మేయర్‌గా అన్ని డివిజన్లలో పర్యటించే బాధ్యత ఉన్నా కొన్ని డివిజన్లకే పరిమితం కావడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బొబ్బల శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ ఎవరో చెబితే జనరల్‌బాడీ సమావేశాలు ఎందుకు నిర్వహించలేదని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇకనుంచి సకాలంలో సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సమావేశాలు పెట్టకపోవడంతో సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని చెప్పారు. కాబట్టి వీలైనంత త్వరగా జనరల్‌బాడీ సమావేశం నిర్వహించాలని కోరారు. నూనె మల్లికార్జున యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరు బాగోలేదని ఆరోపించారు. పన్నులపై వడ్డీ మాఫీ చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నగరాభివృద్ధి కోసం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ ఎంతగానో శ్రమిస్తున్నారని చెప్పారు.

వివరాలు లేవు

బడ్జెట్ నివేదిక రూపకల్పన సరిలేదు. భవన అనుమతి ఫీజులు, ఫ్లెక్సీలపై ఫీజులు, లేఅవుట్/సబ్‌డివిజన్లకు సంబంధించి ఎంత ఆదాయం వచ్చింది?, ఎంత వ్యయం చేశారనే వివరాలు పొందుపరచలేదు. శానిటేషన్ సిబ్బందికి సబ్బులు, నూనె, గ్లౌజులు ఇచ్చేందుకు కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటు. బ్లీచింగ్, సున్నం కొనుగోలు విషయంలో కూడా నిర్లక్ష్యం చేయడం సరికాదు.

– రూప్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్

సమావేశాలు పెట్టకపోవడం దారుణం

ప్రతి మూడు నెలలకొకసారి జనరల్‌బాడీ సమావేశం కావాల్సి ఉన్నా జరపలేదు. ఇటువంటి పరిస్థితి కార్పొరేషన్‌లో ఎప్పుడూ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారు. నగర ప్రజలకు మంచి చేసేందుకు ఇకనుంచైనా నిర్ణీత సమయాల్లో జనరల్‌బాడీ సమావేశాలు నిర్వహించాలి.

– ఖలీల్ అహ్మద్, డిప్యూటీ మేయర్

27 నుంచి మహా కుంభాభిషేక వేడుకలు


సమీక్ష నిర్వహిస్తున్న చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి ఆలయంలో ఈనెల 27 నుంచి మే నెల 3వ తేదీ వరకు మహా కుంభాభిషేక వేడుకలు జరుగుతాయని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఆలయం వద్ద ఉన్న కార్యాలయంలో బుధవారం పాలకమండలి సభ్యులతో చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో తొలుత 1969లో మహా కుంభాభిషేక వేడుకలను నిర్వహించారన్నారు. 2008లో మరోసారి జరిగాయన్నారు. 15 ఏళ్ల తర్వాత తిరిగి ఆలయంలో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇకపై ఈ మహా కుంభాభిషేక వేడుకలను ప్రతి పుష్కర కాలంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన కొలన్ రాజారెడ్డి – పూజిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారని, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను కల్పిస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమీక్షలో ఈఓ వెంకటసుబ్బయ్య, కామేశ్వరి, పద్మ, శివకుమార్, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం


తూర్పు రాయలసీయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సెక్రటేరియట్‌లో ప్రమాణ స్వీకారం చేసి అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న దృశ్యం. - అమరావతి

అగ్రవర్ణాల పేదలకు అండగా ప్రభుత్వం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధుల విడుదల

జిల్లాలో..	
లబ్ధిదారులు : 32,097 మంది	నిధులు : రూ.48.14 కోట్లు


లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కూర్మనాథ్ తదితరులు

నెల్లూరు(అర్బన్): అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ప్రభుత్వం అండగా ఉంటూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఒక్కొక్కరికి రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి అరుణమ్మ, కూర్మనాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి, అధికారులు, లబ్ధిదారులు సీఎం సభను వీక్షించారు. అనంతరం జిల్లాలోని 32,097 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.48.14 కోట్ల మెగా నమూనా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆనం అరుణమ్మ, కూర్మనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, హ్యాండ్లూమ్స్ ఏడీ ఆనందకుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తం వరం



మేము ఇప్పటి వరకు ప్రభుత్వపరంగా ఎలాంటి సంక్షేమ పథకాలను తీసుకోలేదు. తొలిసారిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ప్రవేశపెట్టి అగ్రవర్ణాల పేదలను ఆదుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఎవరి చుట్టూ తిరగకుండా సచివాలయ వలంటీర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకున్నాం. మా బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయడం సంతోషకరం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– వావిలాల ఉమాదేవి, సిరిగార్డెన్స్, అల్లీపురం

కుటుంబ అవసరాలకు ఉపయోగం



ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమను ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఆదుకుంది. నా భర్త రామాలయంలో పౌరోహిత్యం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే రూ.15 వేలు మాకు ఎంతగానో ఉపయోగపడుతాయి. అందరికీ మంచి చేస్తున్న జగన్‌బాబు పదికాలాలపాటు బాగుండాలి.

– నాదెండ్ల సుధామాధవి, నెల్లూరు

కసుమూరు దర్గా అభివృద్ధికి కృషి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి కాకాణి

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కసుమూరు గ్రామంలో ఉన్న మస్తాన్‌వలీ దర్గాకు బుధవారం సాయంత్రం మంత్రి విచ్చేశారు. ఆయనకు ముజావర్లు ఘన స్వాగతం పలికి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. అనంతరం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. వారికి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ప్రభుత్వం వచ్చాక కసుమూరు దర్గా అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నామని చెప్పారు. భక్తులకు సదుపాయాల కల్పనకు కొండపై అనేక పనులు చేశామన్నారు. అలాగే ముస్లిం మతపెద్దలు, యువత కోరిక మేరకు స్థానిక మసీదు అభివృద్ధి కోసం కమిటీని నియమించి తద్వారా అభివృద్ధి చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ కడివేటి శివ, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్ నాయుడు, హుస్సేన్, దస్తగిరి, బాబర్, చీకుర్తి నరసయ్య, గుర్రం పుట్టయ్య, వెంకట్రామానాయుడు, అడపాల ఏడుకొండలు, మందా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లొస్తుండగా..

- పర్వతరెడ్డి మామకు రోడ్డు ప్రమాదం


బోల్తా పడిన కారు

యడ్లపాడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మామ మల్లారెడ్డి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వివరాలు.. రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో బుధవారం చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన మామ మల్లారెడ్డి వెళ్లారు. కార్యక్రమం పూర్తయ్యాక ఆయన, మరో ఇద్దరు ప్రయాణిస్తున్న కారు పల్నాడు జిల్లా యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే కుక్క అడ్డొచ్చింది. దీంతో సడన్‌బ్రేక్ వేసినా అదుపుకాక కారు ఎక్స్‌ప్రెస్ హైవేపై నుంచి పల్టీలు కొడుతూ ఆరడుగులు కిందకు ఉన్న సర్వీసు మార్గంలోకి వెళ్లి పడింది. దీంతో మల్లారెడ్డి, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని చిలకలూరిపేటలోని ఆస్పత్రికి తరలించారు.

వైఎస్ జగన్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

• రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి : అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం 100వ రోజు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ నుంచి పాతూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు కాటా శ్రీనివాసులురెడ్డి, గోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీకి తరలివచ్చారు. కాగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ వేమిరెడ్డి పాల్గొని, మాట్లాడారు. ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం జగన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలిని కనకపట్నం చేయడమే ధ్యేయంగా అన్నిరకాల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్ల వద్ద వారి అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జనిగర్ల మహేంద్రయాదవ్, కనమర్లపూడి వెంకట నారాయణ, కాటా శ్రీనివాసులురెడ్డి, పానుగోటి అనూరాధ, కుందుర్తి సునీత, కుందుర్తి కామయ్య, దండా కృష్ణారెడ్డి, కసుపర్తి రాజశేఖర్, కుందుర్తి శ్రీనివాసులు, జంపాని రాఘవులు, నాయుడు రామ్‌ప్రసాద్, షాహుల్ పాల్గొన్నారు.

వైభోగం.. సంగమేశ్వరుని రథోత్సవం

సంగం : మండల కేంద్రంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సంగమేశ్వర స్వామి రథోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పరిమళ పుష్పాలతో అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం గ్రామ పురవీధుల్లో భక్తుల హరహర మహాదేవ నామాల మధ్య రథోత్సవం సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రథం ముందు గుమ్మడికాయలు, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, సీఐ రవినాయక్ ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 70 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. కోటు దయాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



జనసమూహం మధ్య సాగుతున్న రథోత్సవం, (ఇన్‌సెట్లో) ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

టీడీపీ హయాంలోనే గ్రావెల్ మాఫియా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (విడవలూరు) : గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రావెల్ మాఫియా పేట్రేగిపోయిందని, రిజర్వాయర్ల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలింపు చేసిన ఘనత వారికే దక్కుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. విడవలూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కనిగిరి రిజర్వాయర్ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలింపు జరిగిందన్నారు. ఆనాడు జరిగిన అక్రమాలన్నీ మా ప్రభుత్వంలో జరిగాయని చెప్పడం సిగ్గుమాలిన చర్య అని తెలిపారు. మా ప్రభుత్వంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, జిల్లాలో బ్రిడ్జి నిర్మాణాలు, జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు, సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు మాత్రమే కనిగిరి రిజర్వాయర్ నుంచి గ్రావెల్ తరలింపు జరిగిందని, అందుకు సంబంధించి ఇరిగేషన్ అధికారుల అనుమతితో పాటు జిల్లా అధికారుల అనుమతులు ఉన్నాయన్నారు. ఎక్కడా సొంత ప్రయోజనాలకు వాడుకోలేదన్నారు. టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. చంద్రబాబు సంపదంతా అక్రమార్జనే అని, రెండెకరాల ఆసామికి లక్షల కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు మాట్లాడుతూ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏవిధంగా గ్రావెల్ మాఫియాను ప్రోత్సహించారో అందరికీ తెలుసని, ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మాట్లాడాలని హితవు పలికారు.

మంత్రిని కలిసిన కలెక్టర్, ఎస్పీ






మంత్రి కాకాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ హరి నారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి బుధవారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. - నెల్లూరు(సెంట్రల్)

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ :	రూ.113
లేయర్ లైవ్ :	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.222
లేయర్ చికెన్:	రూ.128

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.80
సన్నవి :	రూ.60
పండ్లు :	రూ.35

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



పొంగూరులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : మెట్ట ప్రాంతంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం, పొంగూరులో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చుక్కల భూముల సమస్యతో వేలాది ఎకరాల రైతులు పడుతున్న ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 163వ నంబర్ జీఓ శాశ్వత పరిష్కారం చూపిస్తుందన్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, ఆయా మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహించామని సమయాభావం వల్ల పెండింగ్‌లో ఉన్న మర్రిపాడు, అనంతసాగరం మండలాల రెవెన్యూ సదస్సు ఈనెల 22న ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలీల సంఖ్య పెంచాలి

• డ్వామా పీడీ వెంకట్రావు

వెంకటాచలం : ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీల సంఖ్యను పెంచేందుకు ఎంపీడీఓలు, ఏపీఓలు ప్రత్యేక చొరవ చూపాలని డ్వామా పీడీ వెంకట్రావు సూచించారు. మండలంలోని తిక్కవరప్పాడులో ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో పలు విషయాల గురించి చర్చించారు. పనులకు వచ్చే కూలీల సంఖ్య ఎందుకు తగ్గుతోందని, కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. పనికి సంబంధించి కూలి తక్కువగా వస్తోందని, అందువల్లే తాము పనులకు హాజరు కావడం లేదని పలువురు కూలీలు చెప్పారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు రూ.252 వరకు ఇస్తుండగా, ప్రస్తుతం రూ.272 లకు పెంచినట్లు తెలియజేశారు. ఈ విషయాన్ని ఎంపీడీఓలు, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీలకు తెలియజేసి వారు క్రమం తప్పకుండా పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీఓ సురేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోవూరు : మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ కాలనీలో చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసంలో 23 బస్తాల రేషన్ బియ్యాన్ని(1,107 కేజీలు) విజిలెన్స్ అధికారులు బుధవారం గుర్తించారు. వాటి విలువ రూ.40,950లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. పట్టుకున్న బియ్యాన్ని సీజ్ చేశామని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు గోపాలకృష్ణ, సుధాకర్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో కోవూరు సివిల్ సప్లయ్స్ డీటీ కృష్ణప్రసాద్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.



అదుపులోకి తీసుకున్న వ్యక్తితో విజిలెన్స్ సిబ్బంది

పూడ్చిన స్థితిలో మృతదేహం

జలదంకి : మండలంలోని కుమ్మరకొండూరు వాగు వద్ద ఉలసబాడవ ప్రాంతంలో ఓ మృతదేహం పూడ్చిన స్థితిలో ఉండడాన్ని బుధవారం గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు.. కోదండరామపురానికి చెందిన ఓ పశువుల కాపరి వాగు ఒడ్డు గుండా వెళ్తున్నప్పుడు ఓ మనిషి కాలు ఇసుకలో నుంచి బయట ఉండడాన్ని గుర్తించారు. వెంటనే అతను మిరపతోటలోని కూలీలకు తెలిపారు. వారి సమాచారం మేరకు ఎస్సై వీరేంద్రబాబు, తహసీల్దార్ పద్మావతి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం బోర్లా పడి ఉందని, గుర్తుపట్టలేని విధంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పొద్దుపోవడంతో శవ పంచనామా గురువారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.